నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 4 మే 2025 | HYDERABAD




## చలాన్ల మోత!

సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ జనంపై జీహెచ్ఎంసీ చలాన్ల మోత మోగిస్తున్నది. రహదారులపై చెత్త వేసిన వారిపై భవన నిర్మాణ వ్యర్థాలు వారికి జరిమానాలు విధిస్తున్నది. సర్కిల్ స్థాయి అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీలు భవన నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై దృష్టి సారించింది. రోడ్ల మీద చెత్త వేసినందుకు ఇప్పటి వరకు సీసీఎంఎస్ ద్వారా రూ. 35 లక్షల జరిమానాలు విధించినట్లు అధికారులు పేర్కొన్నారు. అత్యధికంగా 270 చలాన్లు విధించగా..రూ. 1.52 లక్షలు, మూసాపేట సర్కిల్‌లో 82 చలాన్లకు రూ. 7.48 లక్షలు, ఉప్పల్‌లో 104లకు రూ.1.60 లక్షలు జరిమానాలు వేశారు. మొత్తం 1,445 మందికి జరిమానా విధించగా, రూ. 34.80 లక్షల్లో రూ.11.31 లక్షలు బల్దియాకు చలాన్ల రూపంలో సమకూరింది.



శనివారం మల్కాజిగిరిలోని దయానంద్ నగర్ రైల్వేస్టేషన్ వద్ద విస్తరణ పనులను రైల్వే అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్ రెడ్డి
IVలో

### సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు

- స్లాట్ బుక్ చేయడానికి అరగంటకుపైగా ఆలస్యం
- దరఖాస్తులు అప్‌లోడ్ చేయడంలో ఇబ్బందులు
- తాజా సేవలపై పెదవి విరుస్తున్న వాహనదారులు
- మిగిలిన కార్యాలయాల్లో ఇప్పట్లో సారథి లేనట్టే

కాంగ్రెస్ సర్కారు ఇటీవల అట్టహాసంగా ప్రారంభించిన సారథి పోర్టల్ వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తున్నది. సర్వర్లు మొండికేయడం.. స్లాట్ బుక్ చేసేందుకు అరగంటకుపైగా ఆలస్యం కావడం.. దరఖాస్తులు అప్‌లోడ్‌లో ఇబ్బందులు చికాకు తెప్పిస్తున్నాయి. పైగా ఒక్క లెర్నింగ్ లైసెన్స్ బుక్ చేసుకోవాలంటే..నాలుగైదు క్యాప్చాలు ఎంటర్ చేయాల్సి రావడంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సారథి సేవలపై వాహనదారులు పెదవి విరుస్తున్నారు.

-సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ)

# సమస్యల సారథి



**కాంగ్రెస్** సర్కార్ ఇటీవల ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సారథి పోర్టల్ సేవలను ప్రారంభించింది. రాష్ట్రంలో మొదటి పైలెట్ ప్రాజెక్టుగా సికింద్రాబాద్ తిరుమలగిరి ఆర్టీఓ కార్యాలయంలో సేవలు మొదలయ్యాయి. అయితే సారథి సేవలు పొందాలంటే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏదైనా స్లాట్ బుక్ చేసుకోవాలన్నా.. ఫీజులు చెల్లించాలన్నా సర్వర్లు మొరాయిస్తున్నాయి. గతంలో రెండు, మూడు నిమిషాల్లో డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుక్ అయితే ఇప్పుడు ఏకంగా 20 నిమిషాలకు పైగా సమయం పడుతున్నదని వాహనదారులు వాపోతున్నారు. ఒక్క లెర్నింగ్ లైసెన్స్ బుక్ చేసుకోవాలనుకుంటే నాలుగు, ఐదు క్యాప్చాలు ఎంటర్ చేయాల్సి వస్తున్నదని, దీంతో పాటు ప్రమాదాల నివారణపై మూడు నిమిషాల వీడియో వీక్షించాల్సి ఉంటుందని వివరించారు. వీడియో సమయం సరైనదే అయినప్పటికీ మిగిలిన అన్ని క్యాప్చాలు ఎంటర్ చేయడం అనవసరమేనని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు స్లాట్ బుకింగ్‌లో ఏవైనా డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయడానికి ఎర్రర్స్ వస్తున్నాయి. దీంతో చాలా మంది వాహనదారులు సారథి పోర్టల్ వినియోగంపై పెదవి విరుస్తున్నారు.

### సేవలు ఇప్పట్లో లేనట్లే..

తిరుమలగిరి కార్యాలయంలో సారథి వెబ్ పోర్టల్ పనితీరుపై అధికారులకు సమగ్ర శిక్షణ అవసరం ఉన్నది. సిబ్బంది సైతం గతంలో కాకుండా ఎక్కువ సమయం తీసుకోవాల్సి వస్తున్నదని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సారథి పోర్టల్ మిగిలిన రవాణా శాఖ కార్యాలయాల్లో ఇప్పట్లో అమలు చేసేలా కనిపించడం లేదు. ఇప్పటికే చాలా రవాణా శాఖ కార్యాలయాల్లో పాత కంప్యూటర్లు, కొన్ని చోట్ల సరిపడా లేకపోవడం, సారథి అమలు చేస్తే సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికే మూడు నెలల సమయం పడుతుండటం తదితర కారణాలతో సారథి సేవలు ఆలస్యం కానున్నట్టు అధికారులు చర్చించుకుంటున్నారు.




# ఎక్కడ ఎప్పుడు ఆగుతుందో?

- తరచూ మొరాయిస్తున్న మెట్రో
- సాంకేతిక సమస్యలతో మధ్యలో ఆగిపోతున్న రైలు..
- టెన్షన్ పడుతున్న ప్రయాణికులు
- అసలే ఎండాకాలం.. బోగీల్లో ఇరుక్కుపోతే ఉక్కపోతే



సౌకర్యవంతమైన ప్రయాణం.. కాలుష్యరహితం.. రణగొణ శబ్దాలు వినబడవు.. సాఫీగా.. దర్జాగా త్వరగా.. గమ్యస్థానాలకు.. ఇదీ మెట్రోపై నగరవాసులకు ఉన్న సదాభిప్రాయం. కానీ నేడు ఆ ప్రతిష్ఠ మసకబారుతున్నది.. మెట్రో ప్రయాణమంటే.. హడలిపోతున్నారు..ఎప్పుడు ఆగిపోతుందో.. ఎక్కడ ఆగిపోతుందోనన్న భయం ప్రయాణికులను వేధిస్తున్నది.. 'ఏసీ' బోగీల్లోనూ చెమటలు పట్టేలా చేస్తున్నది. తరచూ సాంకేతిక సమస్యలతో రైలు అది కూడా పీక్ అవర్స్‌లో నిలిచిపోతుండటంతో కంగారుపడిపోతున్నారు. ఇప్పుడు అసలే ఎండాకాలం.. రైలు ఆగి.. బోగీల్లో ఇరుక్కుపోతే.. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి కావాల్సిందేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెక్నికల్ ప్రాబ్లమ్స్‌కు పరిష్కారమే లేదా అని ప్రశ్నిస్తున్నారు.

-సిటీబ్యూరో, మే 3 (నమస్తేతెలంగాణ)

**మెట్రో** సేవలపై నగరవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో రైలు ఎప్పుడూ ఆగిపోతుందోననే టెన్షన్ ప్రయాణికులను వేధిస్తున్నది. ఒక్కసారిగా రైలు మధ్యలోనే ఆగిపోవడంతో రద్దీలో ఇబ్బందిపడుతున్నారు. ఎండాకాలంలో వేసవి తాపాన్ని తప్పించుకోవాలని భావించే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో అన్ని మార్గాల్లో మెట్రో ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. క్యాబ్, ఆటోలతో పోల్చితే ధర తక్కువ ఉండటంతో ఏసీ బోగీల్లో గమ్యస్థానాలకు చేరుకునేందుకు చాలా మంది మెట్రోను ఆశ్రయిస్తున్నారు. ఇలా సౌకర్యాలు ఉన్నాయని మెట్రోలో వారి సంఖ్య పెరుగుతుంటే..నిత్యం రైలు మొరాయిస్తుండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సాంకేతిక సమస్యలు పరిష్కారం చూపితే తప్ప.. మెట్రో ప్రయాణం సౌకర్యవంతం కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

### ఆగిపోతే.. బోగీల్లోనే అరగంట

నెలకొసారి అకస్మాత్తుగా పట్టాలపై ఆగిపోతున్న మెట్రోకు చికిత్స చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఎక్కువ రద్దీగా ఉండే ఎల్బీనగర్ – మియాపూర్ మార్గంలో తరచూ సంభవిస్తున్న బ్రేక్ డౌన్లు ప్రయాణికులను కలవరపెడుతున్నాయి. దీనికి గల కారణాలను అన్వేషించాల్సిన మెట్రో నిర్మాణ సంస్థ... ఆగిపోతే తప్ప.. సమస్యలపై దృష్టి పెట్టడం లేదు. విద్యుత్ సరఫరాలో వస్తున్న సమస్యలు, మెట్రో ఇంజిన్‌లో కలుగుతున్న సాంకేతిక సమస్యలే అంతరాయాలకు కారణమనే అంచనాలు ఉన్నాయి. గతంలో జరిగినప్పుడు కూడా ఇదే విషయాన్ని నిర్వహణ సంస్థ వెల్లడించింది. వీటికి పరిష్కార మార్గాలను చూస్తున్నామని, నిరంతర రాకపోకలు సాగించేలా మెట్రో రైళ్లను సిద్ధం చేస్తామని ప్రకటించింది. కానీ ఇప్పటికీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదు. దీంతో ఒక్కసారిగా ఆగిపోయిన మెట్రో బోగీల్లో అరగంటకు పైగా ఉండాల్సి వస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇక పీక్ అవర్స్‌లో ఇలా నిత్యం జరుగుతుండటంతో మెట్రో ప్రయాణమే భయం గొల్పుతున్నదని ఆందోళన చెందుతున్నారు. కాగా, ప్రయాణ సమయంలో మెట్రో ఆగిపోతే తక్షణమే పరిష్కరించే మార్గమే లేదు. పునరుద్ధరించే వరకు మెట్రో స్టేషన్లు, బోగీల్లో నిలబడి ఉండాలంటే అత్యంత కష్టంగా ఉంటున్నదని నాగోల్ నుంచి హైటెక్ సిటీకి నిత్యం వెళ్లే ఓ ప్రయాణికుడు వాపోయాడు. నెలకోసారి మెట్రో ఆగిపోతుండగా, ఎక్కువగా ఎల్బీ నగర్ నుంచి మియాపూర్ మార్గంలోనే ఎందుకు సమస్యలు వస్తున్నాయనేది ఇప్పుడు అంతు చిక్కని ప్రశ్నగా మారింది.




## స్పందించారు.. తొలగించారు..

బడంగ్ పేట, మే 3: బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఇసుక, కంకర డంపింగ్‌పై 'పాఠశాలా.. డంపింగ్ యార్డా' అనే శీర్షికతో 'నమస్తే'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు. పాఠశాల మైదానంలో ఉన్న ఇసుక, కంకర, డస్టును ఏఈ వినీల్ గౌడ్ దగ్గరుండి తీసివేయించారు. ఆదివారం నీట్ పరీక్ష ఉండటంతో మైదానంలో ఎలాంటి వస్తువులు ఉండకూడదని పై అధికారుల ఆదేశాల మేరకు వాటిని తొలగించారు. పాఠశాల ప్రాంగణంలో ఇసుక, కంకర, సిమెంట్ వేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కమిషనర్ సరస్వతిని ఆదేశించారు. పాఠశాలలో ఇసుక, కంకర వేయడమేంటని ఆమె ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు.

## కరెంటు మీటర్లపై ఆరా !



సిటీబ్యూరో : దక్షిణ డిస్కం చరిత్రలో లేనివిధంగా కరెంటు మీటర్లు మాయం కావడం, మళ్లీ ఎక్కడో ఒక దగ్గర ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో కనిపించడంతో అధికారులు విస్తుపోతున్నారు. ఇబ్రహీంబాగ్ డివిజన్‌లో దాదాపు వంద మీటర్లు కనిపించడం లేదంటూ ఏడీఈ అంబేద్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరుపుతున్న క్రమంలోనే గచ్చిబౌలిలోని టెలికాం నగర్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా దాచిపెట్టిన 42 మీటర్లను కనిపెట్టారు. ఇబ్రహీంబాగ్‌లో వినియోగదారుల పేరిట మంజూరైన మీటర్ల రీడింగ్ కోసం వెళ్తే అక్కడ మీటర్లు లేవు. సదరు సర్వీస్ మీద ప్రతినెలా మినిమమ్ బిల్లు వస్తున్నది. ఈ విషయమై అనుమానం వచ్చిన డివిజనల్ స్థాయి అధికారులు విచారణ చేపట్టి విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరుగుతున్న క్రమంలోనే టెలీకాం నగర్‌లో 42 మీటర్లు బయటపడ్డాయి. వీటిని చిత్రపురి కాలనీలో నిర్మిస్తున్న విల్లాల కోసం ఎలాంటి వెరిఫికేషన్ లేకుండానే తీసుకున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. కాగా, సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సీరియస్ కావడంతో పాటు బాధ్యులైన అధికారులపై విచారణ జరపాల్సిందిగా విజిలెన్స్ అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిసింది.

# బీజేపీ కార్పొరేటర్ వీరంగం


## బల్దియా ఆఫీసులో ప్రభుత్వ ఉద్యోగిపై దాడి

- జాంబాగ్ కార్పొరేటర్ తీరుపై భగ్గుమన్న సిబ్బంది
- కార్యాలయాలకు తాళం వేసి రోజంతా నిరసన
- రాకేశ్ జైస్వాల్‌పై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్
- కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లిన ఉద్యోగులు
- సీరియస్‌గా తీసుకున్న ఆర్ వీ కర్ణన్...
- రెండు సెక్షన్ల కింద కార్పొరేటర్‌పై కేసు నమోదు

అబిడ్స్, మే 3 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ కార్యాలయంలో బీజేపీ కార్పొరేటర్ వీరంగం సృష్టించారు. ప్రభుత్వ ఉద్యోగుల అని కనీస మర్యాద పాటించకుండా అనుచరులతో కలిసి నానా హంగామా చేశారు. అక్రమ నిర్మాణాల అడ్డుకట్ట వేయడంలో తన బాధ్యతను విస్మరించిన జాంబాగ్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్.. తనకే ఎదురు సమాధానం చెప్తారా? అంటూ సహనం కోల్పోయి టౌన్ ప్లానింగ్ ఉద్యోగిపై చేయి చేసుకున్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధి అన్న కనీస బాధ్యతను మరిచి.. వీధి రౌడీలా వ్యవహరించిన తీరుపై ఉద్యోగ వర్గాలు భగ్గుమన్నాయి. కార్పొరేటర్ దాడికి నిరసనగా శనివారం రోజంతా విధులను పక్కన పెట్టి కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలంటూ అన్ని శాఖల ఉద్యోగులు డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. సర్కిల్ కార్యాలయాలకు తాళాలు వేసి నినాదాలు చేశారు. ఈ ఘటనను కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు కమిషనర్ ఆర్ వీ కర్ణన్ దృష్టికి తీసుకువెళ్లగా...సీరియస్‌గా తీసుకున్న కమిషనర్ స్థానిక అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌ను పిలిపించుకుని మాట్లాడారు. కమిషనర్, సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ మంజుల సింగ్ ఫిర్యాదు మేరకు కార్పొరేటర్‌పై రెండు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

### బాధ్యత మరిచిన కార్పొరేటర్

బాధ్యత గల పదవిలో ఉన్న కార్పొరేటర్ విచక్షణ కోల్పోయారు. తన పార్టీ కార్యకర్త అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతుంటే సరిదిద్దాల్సిన కార్పొరేటర్...ప్రభుత్వ ఉద్యోగిపై బెదిరింపులకు పాల్పడ్డారు. 60 గజాల ఇంటి స్థలం విషయంలో అక్రమ నిర్మాణమని ఫిర్యాదు వచ్చిందని, ఫిర్యాదు ఆధారంగా నడుచుకుంటామని సదరు ఉద్యోగి చెప్పిన ఏ మాత్రం కార్పొరేటర్ వినలేదు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ పెరగడంతో కార్పొరేటర్ సహనం కోల్పోయి సదరు సెక్షన్ ఆఫీసర్‌పై దాడికి దిగారు. దీంతో 14వ సర్కిల్ అధికారులు సిబ్బంది కార్యాలయానికి తాళం వేసి నిరసనకు దిగారు. వీరికి అంబర్‌పేట సర్కిల్ అధికారులు సిబ్బంది సంఘీభావం తెలిపారు. అధికారులు, కార్పొరేటర్ మనుషులు అబిడ్స్ పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్‌పై దాడికి దిగారని రాజ్ కుమార్ అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ మంజుల సింగ్ తన సిబ్బంది, యూనియన్ నాయకులతో కలిసి అబిడ్స్ పోలీసులను ఆశ్రయించి కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ తమ సిబ్బందిపై దాడికి దిగినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



### సేవలను నిలిపి నిరసన

కార్పొరేటర్ దాడిని నిరసిస్తూ జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ కార్యాలయానికి చెందిన అన్ని విభాగాలకు చెందిన అధికారులు సిబ్బంది విధులను బహిష్కరించి కార్యాలయానికి తాళం వేసి నిరసనకు దిగారు. కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడంతోపాటు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి తరలివెళ్లి అక్కడ కమిషనర్ ఆర్ వీ కర్ణన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ ఈ విషయంలో సకాలంలో నిర్ణయం తీసుకునేందుకు నిర్లక్ష్యం వహించారని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ టౌన్‌ప్లానింగ్ ముఖ్య అధికారికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది.

### ఉద్యోగులకు బీఎంఈయూ మద్దతు..

అబిడ్స్ ఆఫీసులో ఉన్న సర్కిల్ 14,15,16 గోషామహల్, అంబర్‌పేట, ముషీరాబాద్ వివిధ విభాగాలకు చెందిన అధికారులు సిబ్బంది అంతా ధర్నాకు దిగారు. ఇందుకు మద్దతుగా బీఎంఈయూ యూనియన్ నాయకులు ప్రకాశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌లు పాల్గొన్నారు. కాగా, టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్‌పై బీజేపీ కార్పొరేటర్ దాడి ఘటనపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సీరియస్ అయ్యారు. అధికారులపై దాడులు చేస్తే సహించబోమని కమిషనర్ హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ అధికారులను పిలిపించుకొని వివరాలు తెలుసుకొని పోలీసులతో మాట్లాడారు.



ఎస్ఎన్‌డీపీ పనులపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి


## ఒక్కరోజూ సమీక్ష చేయలే

### సీఎం వద్దే మున్సిపల్ శాఖ: ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, మే 3 : మున్సిపల్ శాఖను సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉంచుకొని ఏడాదిన్నర కాలంలో ఏ ఒక్క రోజూ మున్సిపల్ సమస్యలపై సమీక్షా సమావేశం పెట్టిన దాఖలాలు లేవని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. శనివారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎస్ఎన్‌డీపీ పనులపై రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ శాఖలో కుప్పలు తెప్పలుగా సమస్యలు ఉన్నా.. పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో నిధులు కూడా కేటాయించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలన్న చిత్తశుద్ధి కూడా అధికారుల్లో సైతం లోపించిందన్నారు. మిథిలానగర్‌లో ముంపు సమస్యను చూసిన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అవసరమైన నిధులు కేటాయించారని గుర్తు చేశారు. శివారు ప్రాంతాల్లో ఉన్న ముంపు సమస్యను పరిష్కరించేందుకు రూ. 850 కోట్లు గతంలో కేటాయించడం వల్లే ముంపు సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో కమిషనర్ సరస్వతి, డీటీ మణిపాల్ రెడ్డి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## రేపు అంబర్‌పేట ఫ్లై ఓవర్ ప్రారంభం

IVలో




## ఆ సూట్ కేసులు నావే.!

- పటాకులు సంగతి నాకు తెలియదు
- పోలీసుల ముందు ఆ అధికారి వాంగ్మూలం?

ఖైరతాబాద్, మే 3 : నిమ్స్‌లో అగ్ని ప్రమాద ఘటన తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో పటాకులు, సూట్ కేసు కేసుల్లో ఒక్కో చిక్కుముడి వీడుతున్నట్లు కనిపిస్తోంది. నిమ్స్‌లో జరిగిన అనేక ఎపిసోడ్‌లకు బాధ్యుడిగా చెబుతున్న ఓ అధికారి.. తాను రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినట్లు భావించాడేమో ఆ సూట్ కేసులు తనవేనంటూ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. అయితే పటాకుల విషయంలో మళ్లీ పాత పాటే పాడినట్లు తెలిసింది. కాగా, ఆ సూట్ కేసులు అక్కడ ఎందుకు దాచాల్సి వచ్చిందో....అవి ఖాళీ కేసులా...? అందులో ఏమైనా ఉన్నాయా...? సీసీ కెమెరాలు లేని వార్డులో ఎందుకు దాచాల్సి వచ్చిందనేది విచారణలో తేలాల్సి ఉంది. ఇప్పటికే ఆ అధికారి తప్పులను నిజాయితీపరులైన కొందరు వైద్యాధికారులపై మోపే ప్రయత్నాలు జరుపుతూనే....మరో వైపు పటాకుల కేసు తీవ్రమైంది కావడంతో దాని నుంచి కూడా తప్పించుకునేందుకు కొందరు అమాయకులపై నెట్టి వేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. వాస్తవానికి పటాకులు ఎనిమిది నెలలుగా అదే గదిలో ఉన్నట్లు సమాచారం. ఎక్స్‌ప్లోజివ్ రూల్స్ 2008 ప్రకారం పటాకులను అక్రమంగా భద్రపర్చడం, ఆస్పత్రులు, పాఠశాలలు, పెట్రోలు బంకుల్లో వాటిని నిల్వ చేయడం తీవ్ర నేరంగా పరిగణిస్తారు. అగ్ని ప్రమాదం, పటాకులు, సూట్ కేసుల వ్యవహారంతో పాటు నిమ్స్‌లో ఇప్పటి వరకు జరిగిన, జరుగుతున్న పరిణామాలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. ఇటీవల దవాఖానను సందర్శించిన విజిలెన్స్ అధికారుల బృందం బాధ్యుడిగా భావిస్తున్న ఆ అధికారి పాత, కొత్త రికార్డులను వెలికి తీయడంతో పాటు అతని వ్యవహారంపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

### వర్షసూచన



ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా నగరంలో ఉదయం నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకోవడంతో జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 39.6, కనిష్ఠం 25.1 డిగ్రీలు, గాలిలో తేమ 37 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. - సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ)